423059001

చిత్తశుద్ధి లేని రిత్త మానవులందు
క్రోధమత్సరంబు కూడియుండు
చీకటింటి లోనె చేరును గబ్బిలాలు
మరువబోకుడిట్టి మంచిమాట
చెవులకెవ్వండు వినుశక్తి చేర్చెనోయి
కనులకెవ్వండు ఇచ్చెను కాంతిరేఖ
అట్టి దానిని వెతికెడివాడె నరుడు.

ప్రేమ స్వరూపులారా!

ఇంద్రియనిగ్రహమే విద్యార్థుల యొక్క ప్రథమ ఆదర్శము. విషయసంబంధమైన భోగభాగ్యములు శాశ్వతములు కావు. ఇవి అల్ప సుఖమూ, అనంత దుఃఖమును అందించును. ఇంద్రియములకంటె యింద్రియార్థములు బలమైనవి. అవియే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాదులు. ఈ యింద్రియములన్నింటికి మూలమైనది వాక్కు. వాక్కును జయించిన అన్ని యింద్రియములను జయించినట్లే అవుతుంది. తినుట, మాట్లాడుట యీ రెండు నోటితో జరిగే పనులే. వీటినే ఆహారవ్యవహారములని కూడను పిలుస్తూ వుంటారు. ఈ రెండింటిని యే మానవుడు జయించునో అట్టి మానవుని యొక్క తత్వము దివ్యత్వమైన తత్వమునందు లీనమవుతుంది. అప్పటి నుండి మాటలు స్థంభించి మనసు మాటాడుటకు ప్రయత్నిస్తుంది. మనసు యొక్క నోరు మూయించే నిమిత్తమై బుద్ధిని మేల్కొల్ప వలసి వస్తుంది. క్రమముగా బుద్ధికి బుద్ధి చెప్పి ఆ బుద్ధిని ఆత్మవైపు మరల్చుటకు తగిన కృషి చెయ్యాలి. వాక్కు మనస్సునందు, మనస్సు బుద్ధియందు, బుద్ధి ఆత్మసన్నిధిని చేరే వుపాయమే సాధన. ఇట్టి సక్రమమైన రాజబాట వుండి కూడను మానవుడు భౌతికమైన భోగభాగ్యములకు లోబడి యీ పవిత్రమైన మార్గమును విస్మరించి కేవలము దుఃఖ హేతువైన యింద్రియ మార్గమునే అనుసరిస్తూ వస్తున్నాడు.

ఈ యింద్రియములకు ఆధారమేమిటని యెవ్వరు కూడను విచారించటము లేదు. ఈ సర్వ భోగములను అనుభవించునది యేది అనే సత్యాన్ని కూడను గుర్తించుటకు ప్రయత్నించటము లేదు. బాహ్యప్రపంచమునకు అంతర జగత్తుకు అవినాభావ సంబంధ

మున్నదని విద్యార్థులు గుర్తించాలి. ఆహారాన్ని చూచి ఆనందించేది, అందాన్ని చూచి ఆహ్లాదించేది, పరిమళాన్ని చూచి పరవశించేది యింద్రియములా, దేహమా లేక ఆత్మనా? ఇది శరీరము కాదు యింద్రియములు అంతకంటె కాదు. అన్నింటిని ఆలించి, పాలించి, లాలించే జగత్తును పరిపాలించే మూల తత్వమే ఆత్మ తత్వము. ఇది బాహ్య జగత్తుకు మూలము. అంతర జగత్తుకు ఆది. ఇట్టి ఆత్మ తత్వమును మనము లక్ష్యమునందుంచుకున్నప్పుడే యిట్టి అనిత్యము అశాశ్వతము, అసత్యము అయిన దేహేంద్రియముల యొక్క ప్రభావము మనపై యేవిధముగాను చలాయించవు. అన్నింటికంటె ప్రధానమైన యింద్రియము నాలుక. ఈ ఒక్క దానిని మనము వశము చేసుకుంటే సర్వేంద్రియములు కూడను మనకు సులభముగా వశమవుతాయి. ఈ యింద్రియములను అశ్వములతో పోల్చుకున్నారు కఠోపనిషత్తులో. ఇక్కడ అశ్వము యొక్క విషయాన్ని ఆదర్శముగా తీసుకుంటే జిహ్వకు అశ్వానికి వున్న సన్నిహిత సంబంధ బాంధవ్యము మనకు అర్థమవుతుంది. చక్కగా, పుష్టిగా, వేగముగా పరుగెత్తే అశ్వము వుండవచ్చు. కాని అట్టి వేగముతో పరుగెత్తే అశ్వము వుండినప్పటికి ఒక చిన్న యినుప ముక్కను దాని నోటి యందు చేర్చి కళ్లెముగా వించి దానిని బిగపట్టినప్పుడు యావత్ శరీరము కూడను మనవశమై పోతుంది. ఈ చిన్న కళ్లెమే బాగా బలమైన వేగముగా పరుగెత్తే అశ్వాన్ని ఎలా అరికట్టగలుగుతుంది. అశ్వమునకు నోరే ప్రధానము. దానిని అరికట్టినప్పుడు అశ్వమంతా వశమై పోతుంది. పంచేంద్రియములనే యీ అశ్వమునకు నోరే ప్రధానము. ఒక చిన్న చుక్కాని వల్ల ఎంత పెద్ద తుఫాను వచ్చినప్పటికి మనము పడవను సంరక్షించుకోవచ్చు. ఒక చిన్న అగ్ని కణము చేత యెంత అగ్నినైనా మనము అభివృద్ధి చేసుకోవచ్చు. వాక్కు అనేది అగ్ని కణము వంటిదే. ఈ కణమును మనము యెన్ని విధములైనను వశమా చేసుకోటానికి తగిన కృషి చేయవచ్చు. వాక్కును మనము వశము చేసుకుంటే జగత్తునే మనము వశము చేసుకున్న వారమవుతాము. ఈ వాక్కు చేత ఎంతటి ఘనకార్యమునైనను చేయవచ్చు. ఎంతటి హీనకార్యమునైనను చేయవచ్చు. ఈ వాక్కే ఆశీర్వాదమును అందిస్తుంది. దూషణను చేకూరుస్తుంది. కనుక యీ జిహ్వను జయదేవుడు వర్ణిస్తూ వచ్చాడు.

జిహ్వే రసజ్ఞే మధుర ప్రియత్వం సత్యం హితం త్వాం పరమం వదామి
ఆవర్ణయేథా మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి.

ఓ రసమెంగిన నాలుకా! ఓ పవిత్రమైన నాలుకా! సున్నితమైన మధుర భాషణాలాడే నాలుకా! నీవు అనవసరమైన మాటలలో ప్రవేశించక, మధురమైన అతిగాఢమైన ఆనందము నరిడించే నామ

స్మరణ చేయమని వర్ణిస్తూ వచ్చాడు. 'కాలు జారితే కలుగదు నష్టము, నాలుక జారితే నరకము రా' అన్నారు. ఈ నాలుకను దుర్వినియోగము చేసినప్పుడు హృదయాన్ని యెంతైనా గాయపరుస్తుంది. ఈ గాయమును మాన్పే డాక్టర్లు యీ జగత్తునందు కానరారు.

ఈ యింద్రియములు విషయములతో చేరినప్పుడు అనంతమైన ఆనందమును, అనంతమైన దుఃఖాన్ని కూడను అందిస్తుంది. నీ యింద్రియములు యిక్కడ వుంటున్నాయి. నిన్నెవరో బయట దూషిస్తున్నారు. ఈ దూషణ బయట వుంటున్నది. నీ యింద్రియములు యిక్కడ వుంటున్నాయి. కానీ ఆ దూషణ అనే విషయము నీ యింద్రియములలో చేరేంత వరకు నీవు యే విధమైన వికారము పొందవు. ఆవేశమునకు అవకాశము నందించవు ఉద్రేకపడవు. కానీ ఆ విషయమే నీ యొక్క చెవులకు చేరినప్పుడు నీవు యెంతైనా క్రోధముతోనూ ఆవేశముతోనూ, వుద్రేకముతోనూ నిండిపోతావు. ఆవేశమునకు, యీ వుద్రేకమునకు కారణము యేమిటి? విషయములు యింద్రియములలో వుండినంత వరకు ఎట్టి ఆవేశము రాదు. విషయము యింద్రియములతో చేరినప్పుడే యీ ఆవేశము బయలుదేరుతుంది. అదే మనము మరొక మార్గములో విచారణ చేసినప్పుడు నిన్ను యెవరో బయట వర్ణిస్తున్నారు. నీవు చాలా మంచివాడు, గుణవంతుడని స్తోత్రము చేస్తున్నారు. అది విననంత వరకు అతనిపైన నీకెట్టి ప్రేమగాని, ఆనందముగాని ఆవిర్భవింపదు. ఆ విషయమే నీ యింద్రియములకు సోకినప్పుడు ఆనందముతో అతనిని నీవు యెంతైనా ప్రేమిస్తావు. ఈ ప్రేమకు, ద్వేషమునకు కారణమేమిటి? ఈ విషయేంద్రియముల యొక్క సంబంధమే దీనికి మూలకారణము కనుక విషయములను కొంతవరకు దూరముగా పెట్టినప్పుడే యింద్రియములు ప్రశాంత జీవితాన్ని పొందగలుగుతాయి. లేక విషయేంద్రియములు రెండు కూడినప్పుడు, నీవు సమన్వయ భావాన్ని అభివృద్ధి గావించుకున్నప్పుడు ఎట్టి వికారాన్ని నీవు పొందవు. కనుక యింద్రియములు అరికట్టుట మంటే అంత సులభమైన మార్గము కాదు. సమన్వయ పరచుకోటం అతి సులభమార్గము. ఈ వుద్రేకమునకు, వుల్లాసమునకు పొంగక కృంగక సమత్వము భావించే విచారణ చేయాలి. నీవు యింద్రియములు కాదు. దేహము కాదు. నిరంతర ఆనంద స్వరూపమైన ఆత్మనే అనే విశ్వాసమును మనము బలపరచుకున్నప్పుడే యీ యింద్రియముల యొక్క బాధలు మనకు దూరము కాగలవు. ఈ నిరంతరమైన విశ్వాసముతోనే మానవత్వాన్ని పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టి దివ్యమైన పెన్నిధిని, సన్నిధిని మనము పొందవచ్చు.

మీకందరికి తెలుసు గొప్ప తత్వవేత్త కిల్ఫసిడ్స్ అనే వాడు చిన్న బాలుడుగా వుండినప్పుడు విద్యార్థిగా వేరొక గ్రామములో చదువుతూ వుండేవాడు. అతనికి తండ్రి చక్కని ఉత్తరము వ్రాసాడు. నాయనా! నీవు హృదయ పూర్వకముగా నిత్యము భగవంతుని ప్రార్థించు. నీ మనస్సును దివ్యమైన భగవంతుని సన్నిధికి చేర్చటానికి తగిన కృషి చేయి. తోటి విద్యార్థులతో కాని అధ్యాపకులతోగాని నీవు వినయ విధేయతలతో మెలుగుతూ వుండు. నీవు క్రోధముకు గాని, నిరాశకుగాని, నిస్పృహకుగాని అవకాశము నందించకు. నిన్నెవరైనా దూషించిన క్రుంగి పోవద్దు. నిన్నెవరైనా వర్ణించిన పొంగిపోవద్దు. నీవు యితరులను దూషించవద్దు. కానీ కట్టకడపటికి ఒక్క వాక్యము వ్రాసాడు. నీవు వాగ్దానము చేయవలెనంటె ఒక్క భగవంతునికి తప్ప వేరెవరికి నీవు వాగ్దానము చేయవద్దు. వాక్కు భగవంతుని యొక్క శబ్దము ఒక్క భగవంతునికి తప్ప అన్యులకు నీవు వాగ్దానము చేయవద్దు. చేసే అధికారము కూడను నీకు లేదు. నీ వాక్కును దుర్వినియోగ పరచుకున్న వాడవౌతావు. అప్పుడే నీ తేజస్సు ప్రకాశిస్తుంది. విచక్షణా భావము అభివృద్ధి అవుతుంది. నీవు సమాజములో ఆదర్శవంతమైన విద్యార్థిగా తయారౌతావు. కనుక నీ నాలుకను వశము నందుంచుకో. ఎట్టి సమయమునందు కూడను దానిని నీవు విచ్చల విడిగా విడువ వద్దు. ఆ ఆజ్ఞను శిరసావహించిన సిద్ధ గొప్ప తత్వవేత్తగా రూపొందాడు. విద్యార్థులకు అధిక భాష మతి హాని సలుపుతుంది. విద్యార్థులు కేవలము విద్యావిషయములందు తప్ప అన్యవిషయములందు యే మాత్రము ప్రవేశించరాదు. విద్యార్థిగా నీవు ప్రవేశించావే గాని విషయార్థిగా నీవు ప్రవేశించలేదు. పరిపూర్ణ విద్యను నీవు పొందిన తరువాత, విషయములో నీవు ప్రవేశించవచ్చు. అప్పుడు కూడను మితమైనటువంటి రీతిలో నీవు మెలగవచ్చు. కనుక అతి భాష యందు యీ నాలుకను ప్రవేశింప చేయరాదు.

నాలుక నాలుగు విధములైన పాపములు చేస్తూ వస్తున్నాది. 1. అసత్యమాడటము 2. చాడీలు చెప్పటము. 3. పరదూషణ చేయటము. 4. అతి భాష మాట్లాడటము. ఈ నాలిగింటి వలనే మానవత్వమునందు అశాంతి అభివృద్ధి అవుతున్నాది. అనారోగ్యము కూడను సంభవిస్తున్నాది. కనుక మానవత్వము లోపల 'సత్యంవద ధర్మంచర' యీ సత్యమును మాత్రమే పలకటానికి ప్రయత్నించాలి. కొన్ని సమయములందు సత్యము చెప్పటము కొంచెము ప్రమాద మవుతుంది. అట్టి సమయములందు సత్యమూ వద్దు అసత్యమూ వద్దు. ఈ విధమైన మార్గమును నీవు అనుసరించినప్పుడే సమాజమునందు మానవత్వమును చక్కగా పోషించుకున్న వాడవవుతావు. ఈ యింద్రియములు మహా శక్తివంతమైనవి. సమస్త

సుఖ దుఃఖములకు ఈ యింద్రియములే ముఖ్య కారణము. కనుక ఈ యింద్రియముల యొక్క సత్యాన్ని గుర్తించి దాని రూపనామములు చక్కగా అనుభవించి తదుపరి దానిని సరియైన మార్గములో ప్రవేశపెట్టుటానికి తగిన కృషి చేయాలి. ఒకగొప్ప కవి ఒకగొప్పగానముగా పాడుతూ వచ్చాడు యింద్రియముల గురించి.

దుర్బుద్ధులు గల తలవున్నా దూరులు చెప్పే నోరున్నా
పొంచి చూచు కనులున్నా పంచల విను చెవులున్నా
వంచన గుణ చిత్తమున్నా వంచించే మనసున్నా
ఈరీతులు చూడగనే న్యాయము యిక బ్రతుకదన్నా.

సత్యాన్వేషణ సలిపి, న్యాయమును విచారించి పవిత్రమైన బ్రహ్మమార్గమును ప్రవేశింప చేసేదే ఈ మానవత్వము. మానవుడు సత్యవ్రతుడు. ధర్మపరాయణుడు. న్యాయమే యితనికి ఆటపట్టుగా భావించిన మానవత్వానికి సరియైన సార్థక నామము నిలబెట్టాలి. మానవుని యందున్న ఈ పంచేంద్రియములు యనేక రకములైన యిక్కట్లకు గురిచేస్తుంటాయి. ఒక్కొక్క శబ్దము ఒక్కొక్క జీవిని మాత్రమే భావిస్తూ వచ్చాయి. కురంగ తరంగ మాతంగ విహంగ సలబృందములు ఒక్కొక్క దానికి శబ్ద స్పర్శ రూప రస గంధాదులకు వశమవుతూ వచ్చాయి. వీటిలో శబ్దమునకు వశమయ్యేది జింక. స్పర్శకు వశమై బానిసగా మారేది ఏనుగు. ఏనుగు యొక్క బలము యిట్టిది అట్టిది అని ఎవరు చెప్పలేరు. అంత బలమైన ఏనుగు కూడను స్పర్శ చేత బంధింపబడుతూ వుంటుంది. మిడుత అగ్నిస్వరూపాన్ని చూచి తన ప్రాణము విడువటానికి కూడను సిద్ధమై పోయి అగ్నిలో వచ్చిపడి పోతుంది. చేప మాంసము యొక్క రసాన్ని గ్రోలుతూ తన ప్రాణమును కూడను లెక్క చేయక అందులో పట్టుబడిపోతుంది. తుమ్మెద పుష్పములోని మకరందాన్ని ఆశించి తన ప్రాణమును కోల్పోతుంది. ఈ విధముగా శబ్ద, స్పర్శ, రూప, రస గంధములకు ఒక్కొక్క ప్రాణి వశమై పోతుంది. కాని మానవునకు యీ యైదు వున్నప్పుడు యే విధముగా వశము కాకుండా వుంటాడు. ఇక యితని విషయము చెప్పనక్కరలేదు. అన్నింటికి వశమై పోతున్నారు. మహా బలహీనుడై పోతున్నాడు.

ఒకానొక సమయము లోపల రాక్షస చక్రవర్తి హిరణ్యకశిపుని కుమారుడైన ప్రహ్లాదుని దగ్గరకు పిలిచి విద్యాభ్యాసము చేసే నిమిత్తమై చండామార్కుల దగ్గరకు పంపాడు. తండ్రికి విరుద్ధమైన హరినామాన్ని నిరంతరము స్మరిస్తూ వచ్చారు. తండ్రి భరించుకోలేక పోయాడు. ఆ చండామార్కులను పిలిచి యీ హరినామమును మాన్పించే మార్గమును

భౌతికమైన, సంసారికమైన మార్గములో ప్రవేశపెట్టటానికి తగిన కృషి మీరు చేయాలి అన్నాడు. ఈ బంధహేతువైన విషయాన్ని అతనికి బోధించమన్నాడు. అనగా లోక సంబంధమైన ఆశక్షణ అంతయు యితనికి అప్పచెప్పాలి అన్నాడు. సంసార విషయమైన తత్వాన్ని యితనికి బోధించమన్నాడు. అప్పుడు యీ పారమార్థికము వదలి ప్రాకృతమైన యీ సంసార బంధమైన మార్గమును ప్రవేశిస్తాడని అతని వుద్దేశ్యము. రాజాజ్ఞ ప్రకారము యీ చండామార్కులు యెన్నో విధముల బోధిస్తూ వచ్చారు. కాని ప్రహ్లాదునికి యేవిధమైన చలనము కలగలేదు. ఎట్టి మార్పు సంభవించలేదు. అతను పట్టిన పట్టును సడలకుండా ఒకే విధమైన ఆత్మ భావములో నిలిచాడు. అదే ప్రహ్లాదుని యొక్క ప్రతిజ్ఞ.

పట్టిన దేదియో పట్టనే పట్టెను
పట్టు నెగ్గెడు దాక పోవకుండె
అడిగిన దేదియో అడగనే అడిగెను
అడిగిన దిడు దాక విడువకుండె
తలచిన దేదియో తలచనే తలచెను
తలపు తీరెడు దాక తరలకుండె
కోరిన దేదియో కోరనే కోరెను
కోర్కె చెల్లెడు దాక కాలిచియుండె
పోరు పడలేక తానైన బ్రోవ వలయు
వడలు తెలియక నోపైన అడుగవలయు
తిరిగి పోవుట భక్తుని దీక్ష కాదు.

ఈనాటి విద్యార్థుల వలె, యీనాటి భక్తుల వలె క్షణక్షణము కూడను చలించే హృదయము కాదు ప్రహ్లాదునిది. చలించని దృష్టి చలించని మనస్సు ప్రహ్లాదునిది. ఎట్టి కష్టములకైనా నష్టములకైనా దుఃఖములకైనా తాను లెక్క చేయక హరినామమును వదలక నిరంతరము ఆనందముతో భగవచ్చింతన సలుపుతూ వుండేవాడు. ఈ దృశ్యము చండామార్కులకే ఆశ్చర్యము వేసింది. చక్రవర్తి దగ్గరకు వచ్చారు.

తన్ను నిశాచరులు పొడవ దైత్యకుమారుడు మాటిమాటికీ
పన్నగశాయి! యో దనుజభంజన! యో జగదీశ! యో మహా
పన్న శరణ్యా! యో నిఖిల పావన! యంచు నుతించె గాని తా
గన్నుల నీరు తేడు భయకంప సమేతుడు గాడు భూవరా!

హాములతో కరపించినా, పర్వతములపైనుంచి నూకినా, ఎన్ని విధములైన ఆయుధములతో హింసించినా యే మాత్రమూ చలించడు. కన్నుల నీరు లేదు. భయకంపనమే తుదు కాదు ఏమిటి యీ విచిత్రము మా చేత కాకున్నది అన్నారు. అతి చిన్న బాలుడైనప్పటికిని భార్యాభర్తల సంబంధమైన విషయాలను కూడను అతనికి ప్రబోధించమని చెప్పాడు యీ చక్రవర్తి. దీనిని గుర్తించి లోటి విద్యార్థులను చేర్చుకొని చక్కని కథలు చెప్తుతూ వచ్చాడు ప్రహ్లాదుడు. పిల్లలారా! నారదుడు నాకు బోధించిన కథలన్నింటిలో ఒక కథ నాకు గుర్తు వస్తున్నాది అని చెప్పాడు. ఒక రాజుకు అనేమంది భార్యలుండేవారు. ఆ సవతుల పోరును భరించలేక నిరంతరము చింతిస్తూ వచ్చాడు. ఈ లోకములో భార్యవలన చింతలేని వ్యక్తి వున్నాడా అని ఒక సందేహము వచ్చింది. ఒకనాడు తన రాజ్యములోపల అట్టివారిని పరీక్షించాలని రెండు పెద్ద పెండాల్సు వేయించాడు. ప్రతి వ్యక్తికి దీనిని గుర్తించి చెప్పటకు అసాధ్యమని గుర్తించి ఒక పెండాల్ పైన భార్యకు లోబడిన వారెవరో యిక్కడ కూర్చోవాలి, భార్యను లోబరచుకొన్న వారెవరో యీ పెండాల్ లో కూర్చోవాలి అని రెండు బోర్డులు కట్టించాడు. ఈ వార్తను విన్నారు. మహారాజు వద్ద మనము అసత్యముగా ప్రవర్తిస్తే శిక్షిస్తారని అందరు భార్యకు లోబడిన వారి పెండాల్ లో కూర్చుంటూ వచ్చారు. వీరి సంఖ్య క్షణము క్షణమునకు పెరిగిపోతూ వచ్చింది. ఒక్కరు కూడను రెండవ పెండాలు లోనికి రావటం లేదు. ఈ విధముగా చూస్తూవుంటే ఒక వ్యక్తి వచ్చి ఆ భార్యను వశపరచుకున్న పెండాలు లో కూర్చున్నాడు. ఈ మహారాజు చాలా సంతోషించాడు. ఒక్కడైనా తనరాజ్యములో వుంటున్నాడని. అతని దగ్గరకు వెళ్ళి చాలా గౌరవముగా 'అయ్యా! మీరు భార్యకు వశమైనవారా లేక భార్యను వశపర్చుకున్నవారా సత్యమును పలకమని' అడిగాడు. 'మహారాజా! నేను అసత్యమును ఎప్పుడూ చెప్పను. నేను సత్యమునే పలుకుతున్నాను నేను భార్యకు లోబడినవాడనే' అన్నాడు. 'మరి యెందుకు యీ పెండాల్ లోనికి వచ్చావు. ఆ పెండాల్ లోనికి పోవచ్చు కదా' అన్నాడు. 'మీరు యేమి ఆజ్ఞయిచ్చినా నేను యిక్కడనుండి కదలను' అన్నాడు. ఏమిటి యింత మూర్ఖముగా ప్రవర్తిస్తున్నావని మహారాజు కొంచెము కోపముగా మాట్లాడాడు. అప్పుడు ఆవ్యక్తి చెప్పాడు 'నేను యింటినుండి బయలుదేరే సమయములో నాభార్య ఒక ఆజ్ఞయిచ్చింది. అందరూ వుండిన పెండాలు లో నీవు వుండ కూడదు. ఎవరు లేని పెండాలు లో నీవు వెళ్ళి నిలుచుకో అని చెప్పింది. అందుచే మీ ఆజ్ఞనైనను నేను ధిక్కరించి నా ప్రాణాలైనను నేను యిస్తాను గాని నాభార్య ఆజ్ఞను నేను ధిక్కరించలేను' అన్నాడు. అనగా మనస్సనే యజమానునకు యింద్రియములనే భార్యలు

అధికముగా వుండటం చేత యీ యింద్రియములనే భార్యలకు మనస్సు వశమై పోయింది అని దీని అర్థము. కనుక యింద్రియములు మనస్సు యొక్క స్వాధీనమై పోయి కేవలము మనస్సు మార్గమే పాటిస్తూ వుంటుందిగాని బుద్ధికి యేమాత్రము వశము కావటం లేదు.

దేహము కంటె అతిసూక్ష్మమైనవి యింద్రియములు. ఇంద్రియముల కంటె అతిసూక్ష్మమైనది మనస్సు. మనస్సు కంటె అతిసూక్ష్మమైనది బుద్ధి. బుద్ధి కంటె అతిసూక్ష్మమైనది ఆత్మ. సర్వము కూడను ఆత్మవశము కావలసిందే తప్పదు. కనుక మానవత్వములో యింద్రియములు మహాబలవత్తరమైనటువంటివి. ఈ యింద్రియములను మనము మొట్టమొదట అరికట్టినప్పుడే యీ జీవితము ఆకర్షవంతమైన జీవితముగా రూపొందుతుంది. ఈనాడు యింద్రియములను అరికట్టలేక పోవుట చేతనే వారి యొక్క నడతలుగాని, వారి యొక్క నిలకడగాని, వారి యొక్క కూర్చోటంగాని అన్నీ విరుద్ధమైన మార్గమును అవలంబిస్తున్నాయి. క్లాసు రూములో కదలక మెదలక సరియైన రీతిలో కూర్చునే విద్యార్థి కనుపించటం లేదు. ఏ విధముగా నడచాలి, యే విధముగా కూర్చోవాలి ఏ విధముగా నిద్రించాలి, ఏ విధముగా మాట్లాడాలి, పెద్దలతో వుండేటప్పుడు యే విధముగా ప్రవర్తించాలి అనే విషయములు వారికి యే మాత్రము తెలియదు. ఒక మిత్రునితో మాట్లాడుతున్నప్పుడు ఆ మిత్రునిపై దృష్టి వుండాలిగాని అటు యిటు, యిటు అటు చూచుకుంటూ మాట్లాడ కూడదు. దృష్టిని యే విధముగా కూడను ప్రసరింప చేయకూడదు. ఇది యువకులకు చాలా ప్రధానమైనది. తన దృష్టి సరియైన దృష్టిగా తాను నిలుపుకోటానికి చూచుకోవాలి. ఎవరితోనైనా మాట్లాడుతూ వుండినప్పుడు అనేక రకములుగా అన్ని అంగములు కదలిస్తూ వుంటారు. కొంతమంది మాట్లాడుతూ వుంటే, వుపన్యాసమిస్తుంటే పెద్ద dance ఆడినట్లుగా వుంటుంది. చేతులు, కాళ్ళు అంతా ఆడిస్తూ వికారమైన చేష్టలుగా వుంటుంటాయి. అంగములు ఆడించకుండా మాట్లాడాలి. ఈ విధమైన ప్రయత్నములు మనము చేస్తూ వుండటం చేత యింద్రియములన్నియూ అభ్యాసము చేత సరియైన మార్గములో ప్రవేశిస్తాయి. కనుకనే

శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే
ధ్యానాత్కర్మ ఫలత్యాగ స్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్.

అన్నారు. ప్రతి ఒక్క దానికి మనము అభ్యాసము చెయ్యాలి. అభ్యాసము లేకుండా దేనిని

మనము సాధించలేము. పుట్టినప్పటినుండి కూర్చోటం అభ్యాసము చెయ్యాలి. నడవటం అభ్యాసము చెయ్యాలి. పరుగెత్తటం చేయాలి. మాట్లాడటం చేయాలి. అన్నము తినటం అభ్యాసము చేయాలి. ఇవన్నీ అభ్యాసము చేత ఏర్పడినవే. ఈనాటి విద్యార్థులకు లనభై అడుగుల రోడ్డయినను నడచటానికి స్థలము వుండదు వాళ్ళకు. ఇదంతా ప్రహ్లాదుడు యవ్వనము యొక్క సన్నిపాత లక్షణమని అన్నాడు. తమ అడుగులు తాము చూచుకుంటూ నడచాలి. అదిసరియైన నడక. నడక ఎక్కడో జరుగుతూ వుంటుంది. చూపులెక్కడో పోతుంటాయి. దీనివల్ల ప్రమాదము జరుగుతుంది. తద్వారా అనేక రకములైన బాధలకు గురౌతూ వుంటారు. కనుక యీవిధమైన అభ్యాసము చేత ఇంద్రియములను మనము కొంతవరకు సమన్వయము గావించుకోవచ్చు. కొంతమంది నిద్రించే సమయము లోపల మరింత వికారముగా వుంటారు. చాకలివాడు ఒకపెద్ద మూట కట్టుకొని పోతాడే ఆ మూటవలె తయారై పోతారు. వంగి చాలా కిక్కిరిసి పండుకుంటారు. తద్వారా అనేక రోగములకు కూడను గురౌతారు. కూర్చునే సమయము లోపల యిరువై యేండ్లే ఎనభై యేండ్ల వారివలె వంగి కూర్చుంటారు. ఇది మంచిది కాదు. spinal column bend అయిపోతే అతి త్వరలోనే వృద్ధాప్యము సమకూరుతుంది. నడచే సమయములో చక్కగా కఱ్ఱవలె నడచాలి. కూర్చున్నప్పుడు కూడను కఱ్ఱవలె కూర్చోవాలి. వంగి కూర్చోకూడదు. మనము అభ్యాసము చేసినప్పుడే యింద్రియములు కూడను క్రమక్రమేణా వశమవుతాయి. అనవసర విషయాలలో మనము ప్రవేశించకూడదు. ఈనాటి మానవత్వములో వున్న బలహీనత. అది కన్నులు కనుపించక, చెవులు వినిపించక వున్న వ్యక్తి కూడను యిద్దరు మాట్లాడుతుంటే ఏమిటి మాట్లాడుతున్నారని ప్రశ్న వేస్తుంటారు. వారు ఏమి మాట్లాడితే నీకెందుకు. ఇందులో నీవెందుకు ప్రవేశించాలి. ఊరికే అందరి దగ్గరకు వెళ్ళి మాట్లాడుతూ వుంటారు కొంతమంది. ఇది కేవలము ఒక దురభ్యాసముగా వుంటుంటాది. ఇతరుల విషయాన్ని కూడను ప్రశ్నిస్తూ వుంటారు. అతనేమి చెప్పాడు. ఇతనేమి చెప్పాడు అని. ఇతనికేమి పని యివన్నీ. ఈ విధమైన దుశ్చర్యలు వలనే యింద్రియములు మరింత బాధలకు గురిచేస్తున్నాయి. ఇతరి విషయమునందు కూడను మనము ప్రవేశించరాదు. నీకు ఎంత అవసరమో అంతవరకే నీవు తీసుకో. చిక్కినవారి దగ్గరంతా మాట్లాడటం చేత అది ఒక గౌరవహీనమై పోతుంది. ఎవ్వరు కూడను నిన్ను గౌరవించరు. నీవు వస్తున్నావంటే వస్తున్నాడురా వీడు అని ప్రక్కకు తప్పుకొని పోతారు. ఏమైనా నీకు అవసరముంటే good morning అంటే good

morning, How are you, How are you. అంతే చాలు. యింకేమి వద్దు. ఇట్లు బజారులో నిల్చుకొని మాట్లాడటమనే దురభ్యాసము మహా చెడ్డది. నీకు యేదైనా అవసరముంటే హాస్టలుకు వెళ్ళిన తరువాత, రూముకు వెళ్ళిన తరువాత చర్చించుకోవచ్చు. ఇట్లు బజారులో పోయే సమయములో యువకులెవ్వరును మాట్లాడకూడదు. నీ చూపును అదుపులో పెట్టుకోవాలి. మనము మనుష్యులము. కాకులము కాదు. కాకులైతే అటు యిటు ఒక్క నిముషమైనను స్థిరముగా వుండవు. కనుక యీవిధమైన క్రమ శిక్షణను మనము పాటించినప్పుడే మనము నిజమైన మానవత్వాన్ని పొందినవారమవుతాము.

విద్యార్థులకు యిది అత్యవసరము. చదివే సమయములో సరియైన స్థితిలో మనము కూర్చొని చదువుకోవాలి. ఎందుకనగా యీ దేహమునకు ఒక ప్రత్యేకమైన విశిష్టత వుంటున్నది. పశువులకు, మృగములకు spinal column వంగి వుంటుంది. మనిషికి spinal column చక్కగా వుంటుంది. మూలాధారమునుండి సహస్రారము వరకు పోయే మార్గము సరియైనదిగా వుంటుండాలి. ఇది సరియైన స్థితిలో వుంటే సరియైన ఆలోచనలు సలుపుతూ వుంటుంది. అట్లు కాకుండా వంగిపోతే యిది సక్రమమైన మార్గమును అవలంబించదు. ప్రతి మానవుని యందు కూడను 101 నాడులు వుంటుంటాయి. అందులో ఒక్క నాడి మాత్రమే ప్రత్యేకముగా వుంటుంది. అది కేవలము సహస్రారముతో సంబంధమై వుంటుంది. ఇది ఆధ్యాత్మిక మార్గములో ధ్యాన నిష్ఠలో నుండినవారికి యిది సహాయకారిగా వుంటుంది. దీనినే సుషుమ్న నాడి అన్నారు. ఇడ, పింగళ, సుషుమ్న నాడీ తత్వము లోపల భ్రూమధ్యము నుండి చేరినప్పుడే యీ సుషుమ్న నాడి ఒక ప్రత్యేకమైన ఏకాగ్రతను అందజేస్తుంది. spinal column లోపల మొత్తము 33 rings వున్నాయి. అందు తొమ్మిది నుండి పన్నెండు వరకు వుండిన దానియందే సుషుమ్న నాడి చక్కగా వెలుగుతూ వుంటుంది. నల్లటి మేఘముల మధ్య ఒక్కతూరి మెరుపు మించినప్పుడు ఎంత ప్రకాశముగా వుండునో మన spinal column లోపల అదేవిధముగా విద్యుల్లేఖ ఒక్కతూరి మించుచూ వుంటుందట. అదే మన యొక్క ప్రాణాధారము. కుండలినీ యోగము చేసేవారికి యిది సరిగా అర్థమవుతుంది. ఏ యోగమైనా చేయి యోగము చేయునప్పటికి నీవు సరియైన స్థితిలోనే దేహాన్ని వుంచుకోవాలి. పండుకుంటారు బోర్లా. దిండుపైన books పెట్టుకుంటారు. ఇంక వాళ్ళను వంచుతారు. ఇలా

టి వారికి ఎన్ని గంటలు చదివినప్పటికి వారికేమీ తలకెక్కదు. దేహము చక్కగా వుంటుండాలి కాని యిక్కడ ఎత్తితే అక్కడా ఎత్తితే అమ్మలు పొదిగినట్టుగా వుంటుంటాది. ఇలాంటి వికారమైన చేష్టల వలనే విద్యార్థులకు సరియైన జ్ఞాపకశక్తి లేకుండా పోతున్నాది. సరైన జ్ఞాపకశక్తి మనకు కుదరాలంటే చక్కగా కూర్చొని చదవాలి, చదవాలని లేకుంటే నీవు book మూసి నిద్రపో. సంతోషము. తప్పులేదు. అనవసరంగా నిర్బంధ మాపుస్తున్నావెందుకు. నీవు అలసటగా వుంటున్నప్పుడు చదవకూడదు. ఏదో చదవాలి చదవాలని టీ ప్రక్కన పెట్టుకొని తూగుతూ పోతూ చదువుతూ వుంటే యిలాంటి అవస్థలలో యేమాత్రము చదివి ప్రయోజనము లేదు. ఈ జ్ఞాపకశక్తి పోవటమే కాకుండా ముందు ముందుకు నీకు భయంకరమైన వ్యాధులు కూడా సంభవిస్తాయి. చేతులు, కాళ్లు అదురుతాయి. కనుకనే మానవుడు విద్యార్థి దశయందుండినప్పుడు సరియైన స్థితిలో యీ దేహాన్ని మనము పోషించుకోవాలి.

ఏ ఘనకార్యము సాధించవలెనన్నను దేహము తోనే సాధించాలి. దైవానుగ్రహము పొందాలనుకొన్నను దేహము ఒక పనిముట్టు. ధర్మార్థకామమోక్షములందు ప్రవేశించవలెనన్నను యీ దేహము ఒక ఆధారము. దేహము అశాశ్వతమైనప్పటికి మన కార్యార్థమై దీనిని సరియైన స్థితిలో వుంచుకోవాలి. మనము పాదములకు రక్షలు వేసుకొని బయలు దేరుతాము. ఏదైనా ఒక నది వచ్చిందంటే ఆ పాద రక్షలు చేతిలో పట్టుకొని నడుస్తాము. ఇదేమి పాదుకాపట్టాభిషేకమా?. కాదు. కాదు. ఎందుకు నీవు పాదుకలంతా చేత బట్టాలి. నీ పాదాలను రక్షించుకొనే నిమిత్తమై నీవు దీనిని చేతితో పట్టుకోవాలి. అదే విధముగనే చెప్పులు చాలా విలువలేనివి అయినప్పటికిని దానిని మనకు అవసరమైన విధముగా వుపయోగించుకునేటప్పుడు దానికి యివ్వవలసిన గౌరవమును కూడను యివ్వాలి. దీని వలన కొన్ని ప్రమాదములు కూడను తప్పిపోతాయి.

యుద్ధసమయమునందు తొమ్మిదవ దినము భీష్ముడు ప్రతిజ్ఞ చేశాడు. పాండవులను హతమారుస్తాను రేపటి దినము లోపల అని ప్రతిజ్ఞ చేశాడు. ఈ వార్త ద్రౌపది చెవిలో పడింది. ఆమె కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ వస్తుండాది. కృష్ణా! యినాళ్లు రక్షించిన నీవు యీనాడు నా సుమంగళత్వమును రక్షించలేక పోతున్నావా? కృష్ణా భీష్ముని యొక్క ప్రతిజ్ఞ తప్పదు. అతను సత్యవాక్సంపన్నుడు. అతని మాటకు యేనాడు కూడను విరుద్ధము జరుగదు. కనుక నా పతి యొక్క మరణము సమీపిస్తూ వస్తుండాది. ఈ జగత్తునందు నీవు తప్ప నాకు పతిభిక్ష పెట్టువారు మరొకరు లేరు అని పాదములు గట్టిగా పట్టింది. కృష్ణుడు చెప్పాడు. 'అమ్మా! ఏ ఒక్క దానికైనను కొన్ని ఉపాయములు అత్యవసరము. ఈ ప్రాకృతమైన లోకమునందు, ఈ లౌకికమైన జగత్తు

నందు కొన్ని రకములైన యుక్తులు కూడను అత్యవసరముగా వుపయోగపెట్టాలి. కార్యము సాధించవలెననుకున్నప్పుడు చేయరాని పనులను కూడ మనము చేయక తప్పదు. ఇలాంటి సమయములందు నేను అల్పుడను, అధికుడను అనే భేద భావము పెట్టుకొనరాదు. కనుక నేను చెప్పినట్టు చేయి అన్నాడు. అప్పుడు ద్రౌపతి చెప్పింది కృష్ణా! నీ మాటను నేనెప్పుడైనా వుల్లంఘించానా? నా ప్రాణమునైనను నేను సులభముగా వదులుతానుగాని మీ ఆజ్ఞను నేను వదలను. మీ ఆజ్ఞను నేను పాటిస్తాను అన్నది. కాలము రాత్రి పదిగంటలైంది. పాండవులు పాండవులయొక్క గుడారాల్లో వుంటున్నారు. కౌరవులు కౌరవుల గుడారాల్లో వుంటున్నారు. కానీ ప్రత్యేకించి వుంటున్నాడు భీష్మాచార్యుడు ఒక గుడారములో. ఏదో ఆవేశములో ఆ యొక్క పరిస్థితి యందు ఆ మాట అన్నాడేగాని తిరిగి తనలో తాను బాధ పడుతున్నాడు. సత్యధర్మ స్వరూపులే యీ పాండవులు. సత్యవ్రతులే యీ పాండవులు. వీరిని యే రీతిగా నేను సంహరించాలి. ఇది న్యాయము కాదే. ఏదో చేయరాని పనిని నేను చేస్తున్నానే అని తనలో తాను బాధపడుతున్నాడు. ఏమాత్రము ఆహారము తీసుకోలేదు. కేవలము అటూయిటూ, అటు యిటూ తిరుగుతున్నాడు. ఏ రీతిగా దీనిని చెయ్యాలి. నా మాటను యే రీతిగా దక్కించుకోవాలి. ఏ రీతిగా నేను నిలబెట్టుకోవాలి. అని విచారణ చేస్తూ తిరుగుతున్నాడు. లీలానాటక సూత్రధారియైన భగవంతుడు యెన్ని యుక్తుల చేతనైనను కష్టములను తప్పించవచ్చు. ద్రౌపతికి చెప్పాడు. అమ్మా! ఈ పరిస్థితుల యందు నేను నీవు కలసి పోతుంటే లోకులు కాకులు. నీవు కొంచెము ముందుగా బయలుదేరి వెళ్ళు. అదిగో అదే భీష్మాచార్యుని యొక్క టెంటు. నేను వెనుక వస్తానన్నాడు. ఈమె ఆ కాలము లోపల రాజకుమార్తెలయొక్క చెప్పులు చాలా శబ్దముతో వుంటుండేవి. ఈమె వేసుకొనే చెప్పులు చాలా శబ్దముతో వుంటుండేవి. నిలిపాడు. ద్రౌపతీ! యీ సమయము లోపల నీవు యిటువంటి చెప్పులు వేసుకొని పోవటానికి వీలులేదు. నీ చెప్పులు నాకివ్వు అని ఆ చెప్పులు పుచ్చుకున్నాడు. అంగవస్త్రములో చుట్టుకున్నాడు. భీష్ముడు తలవంచుకొని తిరుగుతున్నాడు యోచిస్తూ. నీవు సరాసరి వెళ్ళి అతని పాదములపై పడు. కేవలము పడిపోవటం వలన వుపయోగము వుండదు. నీ గాజుల శబ్దమును వినిపించు అన్నాడు. పరుగెత్తి పోయింది. అటు యిటూ తిరుగుతున్న భీష్ముని పాదములపై పడింది. గాజుల శబ్దము చేసింది. వెంటనే యోచనలో వున్న భీష్ముడు యీమె ఎవరో సుమంగళి అనుకొని 'దీర్ఘసుమంగళీ భవ' అని ఆశీర్వదించాడు. తక్షణమే యీమె ఆనందించింది. 'పితామహా! నేను దానిని కోరే వచ్చాను'. అన్నది. ఈ విధముగా వారు సంభాషణ సలుపుతున్నప్పుడు యీ యుక్తి ఎవరు పన్నారు? నిన్ను ఎవరు

తీసుకొని వచ్చారు? ఎవరు నీకు యీ మార్గాన్ని చూపించారు' అని ప్రశ్నిస్తూ వస్తున్నాడు భీష్ముడు. భీష్ముని యొక్క వాక్కు తప్పదు. అతను గాంగేయుడుగా వుండి యీ విధమైన ప్రతిజ్ఞలోపల సరియైన సత్యస్వరూపుడుగా వుండటంచేత అతని ప్రతిజ్ఞలన్నీ నెరవేరుతూ వుంటాయి. కొంత సేపయ్యేటప్పటికి కృష్ణుడు ప్రవేశించాడు. 'కృష్ణా! నీవు నేర్పినదే యిదంతా. యీ ప్లాను బాగానే వుంది' అని హెచ్చరించాడు. ఇది సంతోషమే. ఈ పాండవులను రక్షించటానికి యిదొక మార్గమైపోయిందని ఆనందించాడు. అప్పుడతనికి ఆకలి కొంతవరకు గుర్తొచ్చింది. చింత వుండినంతవరకు మనకు ఆకలి యేమాత్రము తెలియదు. చింతలతో వుండినవాడు విందును ఆరగించడు. ఈ దుఃఖము నివారణ అయ్యేటప్పటికి ఆకలి అతనికి గుర్తువచ్చింది. 'కృష్ణా! ఏమిటి నీ చంకలో వున్నవి' అని అడిగాడు. ఆ స్లిప్పర్సు క్రిందవేశాడు. ఇవి ద్రౌపదివని. ఇది భీష్ముని యొక్క కంటి ధారలు వేగముగా కారుతూ వచ్చాయి. 'కృష్ణా! భక్తరక్షణకై నీవు ఎన్ని రకములైన బాధలు పడతావు. ఇదికూడను నీ లీలలలో ఒకటి. ఇది చేయతగినదా, చేయతగనిదా అనే విచారణ కూడ నీకు వుండదు. కనుక యీ విధమైన సమయములో నీవు చేసే దాంట్లో యింద్రియనిగ్రహము లోపల హెచ్చు పల్లములను మనము యేనాడు పాటించరాదు. పరులకు ఉపకారము చేసే విషయము లోపల కాని పరులను సరియైన మార్గములో పెట్టే నిమిత్తము కాని మనము దేనికైనా త్యాగము చేయుట లోపల సిద్ధముగా వుంటుండాలి గాని ఆ త్యాగము లోపల కూడను సక్రమమైన మార్గమును అవలంబించాలి. ఏదో విరుద్ధముగా, మొరటుగా మనము ప్రవర్తించరాదు. సక్రమమైన మార్గము లోపలే యీ యొక్క సంస్కృతి మనకు అలవడుతుంది.

ఈ విధముగా ప్రాచీన కాలమునుండి భారతదేశములో వున్న వేద శాస్త్ర యితిహాస పురాణములలోని ప్రమాణములు విద్యార్థులు గుర్తించినప్పుడు సరియైన మార్గమును వారు తప్పక అనుసరించుతారు. ఈనాటి విద్యార్థులకు శాస్త్రమంటే యేమిటో, పారాయణమంటే యేమిటో, రామాయణమంటే యేమిటో యేమీ తెలియదు. భారతీయ మహర్షులందరు కూడను యిటువంటి పవిత్ర మార్గమును అనుసరించుటచేత వారికి దేదీప్యమానమైన తేజస్సు వారు చిరంజీవులుగా గౌరవ మర్యాదలు నిలుపుకోగలిగారు. అట్టి మహర్షుల యొక్క సాంప్రదాయముగా యీ విద్యార్థులు రూపొందాలి. అప్పుడే మన భారతదేశము యొక్క ప్రాచీన సంస్కృతిని మనము పునరుద్ధరించినవారమవుతాము. భౌతిక విద్యలతో బాటు ప్రాచీన సంస్కృతిని కూడను మనము సరియైన మార్గములో అనుభవించాలి. నా యొక్క వుద్దేశ్యము spirituality యొక్క essence culture. అంతేగాని యీ culture వేరు spiritual వేరు

అని విభాగము చేయరాదు. ఇది ఆధ్యాత్మిక ఆనందము యొక్క స్వరూపమే మనయొక్క సంస్కృ
తి. ఈ సంస్కృతి సంస్కారము నుండి వచ్చినదే. ఈ సంస్కృతమనేది కేవలము సంస్కారము
తో యేర్పడినదే. ఈ సంస్కారమే ఆధ్యాత్మికము. ఈ ఆధ్యాత్మికము చేతనే అన్ని సంస్కృతులు కూ
డను ఆవిర్భవిస్తూ వచ్చాయి. అన్నింటి యందు వున్నది ఒకటే ఒక్కటే ఒక్కటే. అదే ఏకం
సత్! అన్ని దేశముల యొక్క సంస్కృతి కూడను యీ ఆధ్యాత్మిక మార్గములోనే అణగి వుంటు
న్నాయి. మనము ఎన్నిరకములైన స్వీట్లు చేసుకున్నప్పటికి గోధుమ హల్వా, బాదం ఖీరు
గులాబ్ జామ్, జిలేబి అన్నింటిలో వున్నది చక్కెర ఒక్కటే. అని యేవిధముగా మనము
గుర్తించగలమో అదేవిధముగా యే దేశము యొక్క సంస్కృతి యైనను ఆధ్యాత్మికము నుండి
ఆవిర్భవించినదే. culture, spirituality అని రెండు divide చేయటం మంచిది
కాదు. ఒక్క spirituality వుంటుంటే అందులోనే culture వుంటుండాది. శరీరము
టే యేమిటి? కన్ను, ముక్కు, చెవి, కాలు, నోరు, కడుపు, తల అన్నీ చేరినదే యీ యొక్క దేహ
ము. కానీ ఒక్కొక్క అంగము ప్రత్యేకించి ఒక్కొక్క శరీరము కానేరదు. కనుక అన్ని అంగము
లతో కూడిన మన శరీరమే విశ్వం. ఈ విశ్వము విష్ణుస్వరూపము. కనుక సర్వము మనయందే
వుంటుండాది. దీనిని విభాగము చేయుటము మంచిది కాదు. ఇది లౌకికము యిది ఆధ్యాత్మిక
ము అని యే మాత్రము విభాగము చేయకూడదు. ఈ రెండింటి యొక్క ఏకత్వమే దివ్యసృష్టి
కి మూలకారణము. ఒక విత్తనము వుంటుండాది. ఆ విత్తనములో రెండు బద్దలు వుంటున్నా
యి. ఆ రెండు బద్దలు చేరినప్పుడే అది మొక్కగా వృక్షముగా అభివృద్ధి అవుతుంది. రెండూ
రెండు బద్దలుగా చీల్చి వేస్తే యిక సృష్టే వుండదు. ఈ రెండు బద్దలపైన చర్మము husk
వుంటుండాది. దీనినే సంస్కృతి అన్నారు. అయితే దీనిని అది, అది దీనిని వదులటానికి వీలులే
దు. కనుక రెండింటి యొక్క ఏకత్వమే భారతీయ సంస్కృతిగాని, విదేశీయుల సంస్కృతిగాని
సర్వసంస్కృతులుగాని యీ ఏకత్వముతో కూడినవే. ఇలాంటి విశాల భావము లేనివారు కనుకనే
ఒక్కొక్కరు మాదొక సంస్కృతి, మాదొక సంస్కృతి అని యీవిధముగా విభజిస్తూ వచ్చారు. నాది
హిందూ మతము. నాది క్రిష్టియన్ మతము. నాది యిస్లాం మతము. నాది బౌద్ధ మతము. అని యీ
విధముగా విభజించటము లోపల యిది సంకుచితమేగాని విశాలము కాదు. Religion
అంటే ప్రత్యేకము కాదు. Religion అంటే to realise అని అర్థము. అంతేగాని నాదొక
religion నాదొక religion కాదు. అంతా realise చేసిన వారంతా ఒకే religion. కనుక
సరియైన సమన్వయాన్ని మనము కొంత వరకు అభివృద్ధి పరచుకోవాలి.

ఈనాడు శరీరము యింద్రియములకు కొంత సన్నిహిత సంబంధమున్నది. ఇంద్రియములు లేని శరీరము, శరీరము లేని యింద్రియములు వుండుటకు వీలుకాదు. అదేవిధముగనే బుద్ధి, మనస్సు, యింద్రియములు, దేహములకు సన్నిహిత సంబంధ బాంధవ్యము వుంటున్నాది. ఒక చిన్న ఉదాహరణము. కృష్ణుడు ధృతరాష్ట్రుని వద్దకు రాయబారానికి వెళ్ళాడు. ధృతరాష్ట్రుడు ప్రశ్నించాడు "పాండవులు, కౌరవులు అన్నదమ్ముల బిడ్డలే. యీ పాండవులపైనే యింతప్రీతి యెందుకు కౌరవులపైన ఎందుకు చూపటంలేదు? భగవంతునికే యింత భేదము వుండవచ్చునా?" 'ధృతరాష్ట్రా! నీవు భౌతికమైన అంధుడవే కాదు. జ్ఞానాంధుడవు కూడా' అన్నాడు. 'ఇక్కడ పాండవులకు నాకు వున్నటువంటి సన్నిహిత సంబంధ బాంధవ్యము నేను చెప్పుతున్నాను. ఎవరు నన్ను ఆశ్రయిస్తారో, ఎవరు నన్ను సరియైన మార్గములో ఎన్నుకుంటారో, ఎవరు నాకు శరణాగతి అవుతారో వారిని నేను ఆదరించక తప్పదు'. అందువలనే ఒకానొక సమయములో నారదుడు కూడను అడిగాడు. 'నారాయణా! నీవు ఎక్కడ వుంటావో తెలియదు. నీకు బ్రాంచి ఆఫీసులు చాలా వుంటున్నాయి. కాని సరియైన ఎడ్రసు నాకు యివ్వమన్నాడు'. ఇది నా అడ్రసు అన్నాడు కృష్ణుడు 'మద్భక్తాః యత్ర గాయన్తి తత్ర తిష్ఠామి నారద' ఎవరు వారి హృదయములందు నన్ను పరిపూర్ణమైన ప్రేమతో చింతిస్తుంటారో అక్కడే నేను శాశ్వతంగా వుంటాను. ఇది బ్రాంచి ఆఫీసు కాదు కేవలము హెడ్డాఫీసు'. అన్నాడు. 'పాండవులకు నాకు వున్న సంబంధము నీకు చెపుతున్నను వినమన్నాడు. ఇది దేహము. రెండు కాళ్ళు వున్నాయి. కడుపు ఒకటి వుంటున్నది. భుజములు రెండు వుంటున్నాయి. తల ఒకటి వుంటుంటాది. ఇవన్నీ కలిపి చేరితే ఒక దేహము. ధర్మజుడు శిరస్సు వంటివాడు. అర్జునుడు భుజముల వంటివాడు. భీముడు కడుపు వంటివాడు. నకుల సహదేవులు కాళ్ళ వంటి వారు. ఈ దేహములో కృష్ణుడే గుండె. ఆ గుండె లేకపోతే దేహము లేదు. దేహము లేకపోతే గుండె మనకు కనుపించదు. కనుక పాండవులకు నాకు వున్న సన్నిహిత సంబంధ బాంధవ్యమని' అన్నాడు. అదేవిధముగనే దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి యీ అన్నిటితో బాటు చేరుకున్నదే ఆత్మ. ఇవన్నీ కలసినదే ఒక రూపము. ఏకం సత్ వున్నది ఒక్కటే. ఏకదేహములో అనేక అణువులు వున్నట్లుగా అనేక రూపములు ధరిస్తూ వుండాది. కనుక మనము యింద్రియ విషయాలను, దేహసంబంధమైన విషయాలను కేవలము కొంతవరకు మాత్రమే గుర్తించుకున్నాము. ఇక మీదట, మనస్సు యింద్రియములకు, మనస్సుకు బుద్ధికి యింద్రియములకు యేవిధమైన సంబంధము వున్నది. అన్నింటియందు ఆత్మతత్వమే ఏకధారగా అంతర్వాహినిగా యేవిధముగా ప్రవహిస్తుందనేది మున్ముందు తెలుసుకుందాము.